## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### ఏఎస్ఐ శంకర్ సూచన



**ఎల్కతుర్తి,/ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):** రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ శంకర్ సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో బాటసారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, బ్యాంకు ఖాతా వివరాలపై సమాచారం కోరే మెసేజ్‌లు నమ్మవద్దని హెచ్చరించారు. ఓటీపీలు, బ్యాంకు పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు లేదా ఇతర సంస్థల పేరుతో మోసగాళ్లు సంప్రదించే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా మైనర్ బాలురకు బైక్‌లు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రమాదాలు జరిగితే చట్టపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుమన్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్‌గా పసుపులేటి నాసరయ్య ఎన్నిక

**ఖమ్మం,/ ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):**




తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్‌గా పసుపులేటి నాసరయ్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ ప్రకటించారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా నూతన చైర్మన్ పసుపులేటి నాసరయ్య స్పందిస్తూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్‌కు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.వి. కృష్ణారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవి తనకు గౌరవకరమని, ఉద్యమకారుల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తానని చెప్పారు. ఇకపై తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం కృషి చేయడంతో పాటు, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై పోరాటం కొనసాగిస్తానని నాసరయ్య స్పష్టం చేశారు. ఉద్యమ స్ఫూర్తిని మరింత బలపరిచి, జిల్లాలో కార్యకలాపాలను విస్తరింపజేస్తానని తెలిపారు

## వాహనదారులు హెల్మెట్ వినియోగం తప్పనిసరి

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు







జర్నలిస్ట్ యూనియన్ స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ పావుశెట్టి శ్రీనివాస్

**గణపురం/ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరిగా చేసుకోవాలని గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. శుక్రవారం గణపురం పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ భూపాలపల్లి కమిటీ, చక్రవర్తి హాస్పిటల్ వరంగల్, శ్రీకాంత్ మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే వాహనాలను సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రభుత్వం విధించిన నియమాలు ప్రజల భద్రత కోసమేనని, ప్రతి ఒక్కరూ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలతో పాటు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ప్రాణం పోయిన తర్వాత బాధపడినా ప్రయోజనం లేదని, ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలను కాపాడతాయని పేర్కొన్నారు. వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చునేవారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎవరైనా తన పేరు చెప్పినా నిబంధనలు ఉల్లంఘిస్తే విడిచిపెట్టవద్దని పోలీసులకు తెలిపారు.

సింగరేణి, ఏఎంఆర్, జెన్కో, మెగా సంస్థల సహకారంతో మరిన్ని హెల్మెట్లు పంపిణీ చేయాలని కోరారు. చక్రవర్తి హాస్పిటల్ అధినేత డా. తరుణ్ రెడ్డి 200 హెల్మెట్లు అందించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. వ్యాపారవేత్తలు కూడా ముందుకు రావాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్మెట్ ధరించడం అత్యంత కీలకమని, ప్రమాదంలో ఒకరి ప్రాణ నష్టం కుటుంబానికి తీవ్ర దెబ్బతీస్తుందని అన్నారు. చలానా భయంతో కాకుండా ప్రాణ భద్రత కోసం హెల్మెట్ ధరించాలని సూచించారు.

జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వచ్చే వారికి పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వకూడదని సూచించారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 6,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందినట్లు తెలిపారు. రహదారి భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. జర్నలిస్టులు, వైద్యులు కలిసి హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో సందాని, డీఎస్పీ సంపత్ కుమార్, డిపిఆర్ఓ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ కట్కూరి రాధిక





శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుండి హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

# పేదల పాలిట వరం కళ్యాణ లక్ష్మి పథకం

**- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.**

**రాయపర్తి/ఫిబ్రవరి 27(జర్నలిస్ట్ వార్త):** నిరుపేద కుటుంబాల ప్రజలకు ప్రభుత్వం అందించే కళ్యాణ లక్ష్మి పథకం వరం లాంటిదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 66 మంది లబ్ధిదారులకు 66,07,656 రూపాయల కళ్యాణ లక్ష్మిషాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడమే కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆడపిల్లల వివాహ సమయంలో



కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా లబ్ధి చేకూరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు మంజూరైన 38,50,000 రూపాయల సిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, సర్పంచులు గారే సహేంద్రభిక్షపతి, చిర్ర వేణు, గుజే సుధాకర్, రాయిని యాకన్న, భూక్య శ్రీదేవిసమ్మయ్య, సూదుల ఉమాదేవి, గుగులోత్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలకు హాజరైన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



**సుజాతనగర్, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):**



సుజాతనగర్ మండలం పాత అంజనాపురం గ్రామంలో బాగం మోహన్ రావు నూతన గృహప్రవేశ వేడుకకు నాగా సీతారాములు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గృహప్రవేశం సందర్భంగా ఆయన గృహనిర్మాణం పూర్తి చేసుకున్న మోహన్ రావును అభినందించి, కుటుంబానికి శుభమంగళాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం కొత్తగూడెంలోని కమ్మ సత్రంలో నిర్వహించిన గుగులోత్ భాస్కర్ పద్మ దంపతుల కుమారుడు ఉదయ్ కుమార్, దివ్యవర్షిణి వివాహ విందు కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తూ వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మాజీ సొసైటీ అధ్యక్షులు మండే వీరహనుమంతరావు, శీతంపేట బంజర సర్పంచ్ గుగులోత్ జానకిరాం, మాజీ సర్పంచ్ భద్రూ నాయక్, బత్తుల కేశవరావు, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, ఎట్టి భాస్కర్, అమ్మ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్‌తోనే సమాజ ప్రగతి

**మానవ మనుగడ శాస్త్రానికే అనుసంధానం -చిన్ననాటి నుంచే లక్ష్యం సాధనకు దృఢ సంకల్పం అవసరం**

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**






**సత్తుపల్లి,/ ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):** సమాజ అభివృద్ధి సైన్స్‌పైనే ఆధారపడి ఉందని, మానవ మనుగడ శాస్త్రానికే ముడిపడి ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం (ఫిబ్రవరి 28) పురస్కరించుకుని పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ వారోత్సవాలు శుక్రవారం ఉత్సాహభరితంగా ముగిశాయి.

ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన సుమారు 200కు పైగా శాస్త్రీయ నమూనాలు, ఆవిష్కరణలు సైన్స్ ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రయోగాల ఆధారిత విద్య ద్వారా విద్యార్థుల్లో అవగాహన, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు. సైన్స్ పట్ల ఆసక్తి పెరిగితేనే దేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని ఆమె అన్నారు. చిన్ననాటి నుంచే స్పష్టమైన లక్ష్యం ఏర్పరచుకుని దాని సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా బేగం కమల్, వైస్ చైర్మన్ బొంతు సుమలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సైన్స్ ద్వారా సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, వార్డు కౌన్సిలర్ అపర్ణ తదితరులు విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, అవినాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## గృహప్రవేశానికి హాజరైన అడపా అనిల్ చౌదరి



**తల్లాడ,/ ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం నూతనకల్లు గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. షేక్ సిద్దు నిర్మించుకున్న కొత్త ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకలో ఖమ్మం జిల్లా విభాగ ముఖ్య నాయకుడు అడపా అనిల్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ మట్టారాగామయి ఆదేశాల మేరకు గ్రామ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 6వ వార్డ్ సభ్యుడు వీరబాబు ముదిరాజ్ కూడా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దు, అన్వార్ పాషా, సైదులు, నరేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గృహప్రవేశ వేడుకను విజయవంతం చేశారు.

## వరంగల్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం -ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ వార్త):**

వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో జాప్యంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజారోగ్యంపై ఎందుకంత నిర్లక్ష్య ధోరణి అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. 2021 జూన్ 21వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. 24 అంతస్తులతో రెండు వేలకు పైగా పడకల సామర్థ్యంతో పలు జిల్లాల ప్రజలకు సేవలు అందించేలా ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూపకల్పన చేశామని తెలిపారు. రెండేళ్లలో 75 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. 2023 వరకు కూడా ఈ ప్రాజెక్టు వేగంగా సాగిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులు నెమ్మదించాయని చెప్పారు. కావాలనే ఈ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు.

--------------

